
# ఉత్తరాయణం

పి. రామగోపాల్

గంగాధర్




*బహుళ ప్రచారంగల ఒకానొక పత్రిక ఒక కథలపోటీ నడిపింది. ఓ అందమైన అబ్బాయికి అందులో మొదటిబహుమతి లభించింది.*

ఆ అబ్బాయి అందమైన ఫొటో పత్రికలో వేస్తూ "ఈ అబ్బాయి ఈ మధ్యనే విదేశాలలో చదువు పూర్తిచేసి కొని వచ్చాడు. ఓ కంపెనీలో ఓ పెద్ద ఉద్యోగం నిర్వహిస్తున్నాడు. చక్కని రచయిత కాగల లక్షణాలు ఇతనిలో చాలా ఉన్నాయి. చక్కని భవిష్యత్తుగల ఇతని జీవితం ఓ నందనవనం కావాలని మా అభిలాష" అంటూ క్లుప్తంగా ముగించారు ఆ పత్రికా సంపాదకులు. అందమైన ఆ అబ్బాయి ఫొటో చూసి, దాని క్రింద రాసినది చదివిన చాలామంది అమ్మాయిలకు నోరూరిన మాట నిజం. స్వతంత్ర భావాలు, వాటి నాచరణలో పెట్టగల స్వేచ్ఛగల అమ్మాయిలు అతనికి ఉత్తరాలు రాసేశారు. తలిదండ్రుల చాటునున్న అమ్మాయిలు, చాటుగానే, ఆ అబ్బాయిని ప్రశంసిస్తూ ఉత్తరాలు రాశారు. ఏది ఏమైనా ఆ అబ్బాయి "ఫాన్ మేల్" మాత్రం బ్రహ్మాండంగా పెరిగిపోయింది.

ఒకరోజు, ఆ అబ్బాయికి వచ్చిన ఈ రెండు ఉత్తరాలు మాత్రం మీరు చదువుకోవటంకోసం ఇక్కడ పొందు





పరుస్తున్నాను అతడు చదివిన మొదటి ఉత్తరం ఇది:

హైదరాబాదు,
23 జూన్, 64
సంధ్యా సమయం

.............గారికి,

మీ కథ చదివి తన్మయులైపోయిన వారిలో నేనొకర్తెను. కాని నా కన్నా మిమ్మల్ని శ్లాఘించేవారు మరొకరున్నారు. ఆమె నా స్నేహితురాలు శైలూ. అదే శైలజ. మీకథ చదివినప్పటినుంచి (అందులో ఇంకా మీ ఫోటో చూసినప్పటినుంచి) అది ఈ లోకంలో ఉంటటంలేదు. దాని తరహా చూచి, అనుమానంవేసి సూటిగానే అడిగాను. నాతో చెప్పుకొని సిగ్గుపడింది. ఇంకా మీ దగ్గర ఏం దాచకుండా ఉండాలంటే అది మిమ్మల్ని మనస్ఫూర్తిగా ప్రేమించిందనే చెప్పాలి. అది అడగకపోయినా దాని బాధ అర్థం చేసుకుని, ధైర్యంచేసి నేనీ ఉత్తరం రాస్తున్నాను.

మా "శైలూ" అందం వర్ణించడం కంటే ఆమె "బాపూబొమ్మ" అంటే మీరే అర్థంచేసుకుంటారు. పచ్చని పసిమిఛాయతో, చలాకీగా, చిలిపిగా మెరిసేకళ్ళతో ఎప్పుడూ హాయిగా తిరిగే శైలూ మా కాలేజీకే "అయస్కాంతం". మేమిద్దరం బి. ఎ. ఫైనలు వెలిగిస్తున్నాము. నాకు మాత్రం చదువంటే బోరు. శైలూ అలా కాదు. తెలుగు సాహిత్యం, అందులో ఆధునిక సాహిత్యం (శవసాహిత్యం కాదు సుమా) మీద దానికి వల్లమాలిన అభిమానం. దాని గది ఓ పెద్ద లైబ్రరీ. వ్యాసరచన, వక్తృత్వం పోటీలలో దానికి మొదటి బహుమతి రాకుండా చేయాలని ప్రయత్నించి ఎందరో చిత్తుగా ఓడిపోయారు. మా శైలూ సంగీత విశారద కూడాను. వీణ బాగా వాయించగలదు. హిందుస్తాని సంగీతం కమ్మగా, హాయిగా పాడుతుంది.

మా శైలూ కుటుంబంకూడా గొప్ప దేను. వాళ్ళ నాన్న గవర్నమెంటులో సెక్రటరీ. ఆమె అన్నయ్య లందరూ వరుసగా ఇంజినీర్లే. ఇంకా చెప్పా లంటే, మా శైలూది చాలా 'సెన్సిటివ్ నేచర్.' దాన్ని కాస్తగట్టిగా మందలించినా, దాని కళ్ళు వర్షిస్తాయి. చాలా అమాయకురాలని నా కన్పిస్తుంది.

ఇంతకన్నా ఓ వధువులో వరుడు కోరదగ్గ లక్షణాలు మరే ముంటాయి.

ఇంక మీ అభిప్రాయం తెలుసుకోవడమే నా విధి. తీరికలభిస్తే, మా ఊరు నొకసారి పావనంచేయండి. శైలజను పరిచయం చేస్తాను.

జవాబు రాస్తారు కదూ !

ఇట్లు,
రాధ

● ● ●

ఇంక రెండవది.

విజయవాడ
26 జూన్ 64
ఉదయం.

.............గారికి,

పొరబాటున ఈ ఉత్తరం నాదగ్గరకు వచ్చింది. నేను దాన్ని చదివేశానుకూడా. ఇందుకు మీరు నన్ను క్షమించాలి. ఈ ఉత్తరాన్ని భద్రంగా మీకు పంపిస్తున్నాను. ఇంక మీరు నా గొడవకూడా కాస్త వినాలి.

నేను 'శైలజ' అంత అందమైన దాన్ని కాదనుకుంటాను. పొట్టిగా, బొద్దుగా ఉంటానని అంటారు. "ముద్దబంతిపూవు" అంటే మీకర్థం అవుతుందనుకుంటా. నేను "పచ్చని పసిమిచాయ"లో ఉండను. నాది చామనచాయ. నా కళ్ళు కాంతులీనవు. కొట్టొచ్చినట్లు కనపడతాయి నేనేమంత గొప్పగా చదువుకోలేదు. అసలు నా జన్మలో కాలేజీలో అడుగుపెట్టనేలేదు. కాని సంసార నిర్వహణ మాత్రం చేయగలను. కమ్మగా వండి పెట్టడం నాకు బాగా చేతనవును.

సంగీతం అంటే చెవులు కోసుకుంటాను కాని నాకు సంగీతం అసలురాదు. మా కుటుంబం అన్ని మధ్యతరగతి కుటుంబాల లాంటిదే. తెలుగు సాహిత్యం గుర్చి గూడా నాకు పెద్దగా తెలియదు. ఉబుసుపోక, ఏదో పత్రికల్లో కథలు మాత్రం చదువుతూ ఉంటాను. మీకథలంటే నాకు చాలాగౌరవం, ఇష్టం.

ఇక పోతే నా వ్యక్తిత్వం గూర్చి. దానికి నేను ప్రాధాన్యం ఇవ్వడం మరిచిపోయాను నా జీవితాన్ని నేను నమ్మిన వారిచేతిలో పెట్టి, వారికోసమే జీవించడం నా లక్ష్యం.

మీ ఫొటో, చాలా అందంగా ఉంది. మిమ్మల్ని నేను మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నాను.

ఇంకో ముఖ్య విషయం, ఇంకో నెలలో, దేవుడు మేలుచేస్తే చక్కని పండంటి అబ్బాయినో, అమ్మాయినో, కనబోతున్నాను.

నేను మీకు సరిపోతానా ?
జవాబుకోసం ఎదురుచూస్తూ....

మీ ప్రియమైన భార్య,
సీత.

□□□





# శ్రీ సుసర్ల దక్షిణామూర్తి

గంభీరాకృతి, విచిత్రమైన ప్రకృతి గల శ్రీ దక్షిణామూర్తి ప్రత్యేకమైన వ్యక్తిత్వంగల వ్యక్తి. సలక్షణాలైన రాగాలలో విలక్షణాలైన ప్రయోగాలతో వరసలు కట్టడంలో వీరిది అపారమైన శక్తి. ఘన గాంధర్వ విద్యాదక్షులైన తండ్రి తాతలంటే వీరి కెనలేని భక్తి. సంగీత వంశోద్భవులు గనుకనే వీరికి శైశవంనుండీ పాటలయందమితానురక్తి. వీరి ఒక్కొక్క మాటలోనూ స్ఫురిస్తుంది చక్కని యుక్తి. ఎన్నడూ లోటులేని భుక్తిగల వీరికి, బీదసాదలకు శక్త్యానుసారం దానంచేయడంలో మెండైన ఆసక్తి.

వీరిది బృహచ్ఛరీరమూ, మహచ్ఛారీరమూను. బలిష్ఠమైన కాయం పటిష్ఠమైన ధ్యేయం-గరిష్ఠమైన గేయం. మనిషి చాలా సింపుల్. గడ్డంమధ్య కలదొక-సొంపుకి సొంపుల్ అనదగిన డింపుల్, వయస్సుతో మేదస్సు ముదిరిందేకాని మనస్సుమాత్రం ముదరలేదు. కుదురుగా బాల్యావస్థలోనేవుంది. కనకనే, బుల్లిపిల్లాడికి మల్లే మాటాడతారు నిర్మలంగా, నిర్మొగమాటంగా.

మెల్లిగా మాటాడినా-కంఠం తారావథాన్నంటుకుంటుంది. మరి పాడితే చెప్పేదేముంది ! ఓ రోజుని రిహార్సల్సులో నాకు వీరు పాటనేర్పే సమయంలో గళంవిప్పి అనర్గళంగా ఆపళంగా చారుకేశి రాగాలాపన చేస్తూండగా ఆ గది దద్దరిల్లింది. గోడలు వణక సాగాయి. వీరి ప్రచండ కంఠ స్వరోద్గత స్వర తరంగాల తాకిడికి తట్టుకోలేక. ఈ వాతావరణంలో నేను పాడి చూసుకున్నా - నా పాట నాకే వినిపించలేదు. నాకు నా నాజూకైన గొంతు తల్చుకునేసరికి సిగ్గేసింది.

ఇంత గొంతుగల ఈయన మైకు ముందెలా పాడతారూ అనే సిల్లీ సందేహం కలిగింది. మెడ్రాసులో పాడితే ఢిల్లీ ప్రజలకు సైతం విస్పష్టంగా వినబడేంత ఘనధ్వని పరిమాణంగల గళం వీరిది వీరు

పి. బి. శ్రీనివాస్